ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

ఆదివారం 16 నవంబరు 2025

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని బ్రహ్మంసాగర్ రిజర్వాయరులో నీరు 17.2 టీఎంసీలకు చేరుకోవడంతో శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోవు రోజుల్లో వేసవిలో కూడా పొలాలకు నీరు వదులుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డి, తహశీల్దారు కార్తీక్, సోమిరెడ్డిపల్లె సింగిల్‌విండో ఛైర్మన్ యల్లటూరి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలహారతి



కుడా.. అక్రమం బడా..!



కుడా కార్యాలయం

కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)లో కొంతమంది అధికారులు అధికారాన్ని అడ్డు పెట్టుకుని అనుమతుల్లో మాయాజాలానికి పాల్పడుతూ లంచాలు కుమ్మేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి అపార్ట్‌మెంటుకు, కమర్షియల్ భవనానికి, లేఅవుట్‌కు ప్రభుత్వ ఫీజులే కాకుండా.. వీరి సొంత ఫీజులు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా గృహ, వాణిజ్య, అపార్ట్‌మెంటు నిర్మాణాల్లో లొసుగులు లేకుండా ఏవీ ఉండవని ప్లానర్లే చెబుతారు. అయితే కుడా అధికారులు మాత్రం ఓ భారీ అపార్ట్‌మెంటుకు అన్నీ సక్రమంగా ఉన్నాయంటూ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇది ఎనిమిదో వింత అంటూ అటు ప్లానర్స్, ఇటు బిల్డర్స్ చెప్పుకోవడం గమనార్హం.

- ప్రతి అక్రమ కట్టడానికి ఓ రేటు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఇక్కడ దీర్ఘకాలికంగా అధికారుల తిష్ఠ

అపార్ట్‌మెంట్‌లోని సెల్ట్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ 2019లో టీడీపీ హయాంలో ఏర్పాటయింది. తొలుత అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంటుగా ఏర్పాటు చేశారు. తర్వాత కడప అర్బన్ డెవలప్‌మెంట్‌గా మారింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలతో పాటు 90 శాతానికి పైగా గ్రామ పంచాయతీలు కుడా పరిధిలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వేసే లేఅవుట్లు, ఇతర నిర్మాణాలు కూడా కొన్ని కుడా పరిధిలోకి వస్తాయి.

ఒక్కో రేటు

కుడా అనుమతి ఇచ్చిన ప్లానుకు చేపట్టిన నిర్మాణాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉందని చెబుతున్నారు. ఇందుకోసం గాను అపార్ట్‌మెంటుకు అయితే ఓ రేటు, కమర్షియల్ కాంప్లెక్స్‌కు ఒక రేటు చొప్పున అధికారులు ఆమ్యామ్యాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మాణాలను బట్టి ఒక్కోదానికి రూ.10లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగానే వసూలు చేశారని ప్రచారం సాగుతోంది.

- కడప శివారులోని రిమ్స్‌కు వెళ్లే రహదారిలో భారీ అపార్ట్‌మెంట్లు నిర్మించారు. ఐదు ఫ్లోర్లకు అనుమతి తీసుకున్నారు. ఇందులో పార్కింగ్ కోసం రెండు సెల్లార్లతో పాటు సిల్ట్ పైన ఐదంతస్తుల నిర్మాణాల కోసం అనుమతులు పొందారు. సెల్లార్ కేవలం పార్కింగ్ కోసం వాడుకోవాలి. సిల్ట్ కూడా వాచ్‌మన్ రూం, పార్కింగ్‌కు ఉపయోగించుకోవాలి. అయితే ఇక్కడ సిల్ట్‌లో సూపర్ మార్కెట్ పెట్టారు. ఇక అదనంగా అంతస్తులు నిర్మించారు. అయితే.. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన బీపీఎస్ ద్వారా మార్కెట్ వాల్యూ చెల్లించి రెగ్యులర్ చేసుకోవచ్చు. ఇలా చేస్తే సుమారు కోటి రూపాయల వరకు ప్రభుత్వానికి ఫీజులు వస్తాయి. అయితే కుడా అధికారులు ఇక్కడ నిర్మాణాలు సక్రమంగా ఉన్నాయంటూ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇక్కడ పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే చర్చ నడుస్తోంది.

అనుమతుల్లో డొల్ల

కడప కార్పొరేషన్‌లో 1000 చదరపు మీటర్లు దాటిన నిర్మాణాలకు కుడాలో ప్లాను ఇవ్వాల్సి ఉంది. కమర్షియల్ కాంపెక్స్, అపార్ట్‌మెంట్లు, ఇతర భారీ భవన నిర్మాణాలకు కుడా అనుమతి ఇవ్వాలి. ప్రభుత్వ ఫీజులు చెల్లించడంతో పాటు నిబంధనల ప్రకారం నిర్మాణాలను సాగించాలి. దీంతో నిర్మాణాలకు అటు బిల్డర్స్, ఇటు డెవలపర్స్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. కడప పరిధిలో మొత్తం 22 వాటికి కుడా అనుమతులు ఇచ్చింది. వీటిలో నిర్మాణాలు కొన్ని పూర్తయ్యాయి. అయితే.. కుడా ఇచ్చిన అనుమతుల్లో చాలా మటుకు డొల్లతనం ఉన్నట్లు చెబుతున్నారు.

- అల్మాస్‌పేటలోని ఒక అపార్ట్‌మెంటు నిర్మాణం నత్తనడకన సాగడంతో పాటు చేతులు మారుతూ వచ్చింది. ఇక్కడా భారీ ఎత్తున లోపాలు ఉన్నాయని చెబుతారు.

ఇవి రెండు మాత్రమే కాదు.. కుడా అనుమతులు ఇచ్చిన వాటిలో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగాయి. కుడాలో కొందరు అధికారులు దీర్ఘకాలికంగా పనిచేస్తుండడంతో అక్రమాలకు ఊతం ఇస్తున్నారని చెబుతున్నారు. మామూలుగా అందరి దృష్టి కార్పొరేషన్‌పై ఉంటుంది. కుడాపై పెద్దగా ఉండదు. దీన్ని అవకాశంగా తీసుకుని కుడా అధికారులు కుమ్మేస్తున్నారు. కుడా ఇచ్చిన అనుమతులు, చేపట్టి నిర్మాణాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేస్తే అక్రమాల గుట్టు రట్టు అవుతుంది. ప్రభుత్వ ఖజానాకూ నిధులు సమకూరుతాయి.

డీఎస్పీతో సునీత దంపతుల భేటీ

పులివెందుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్‌లపై నమోదైన తప్పుడు కేసుకు సంబంధించి ఇటీవల ఇద్దరిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు రిటైర్డ్ ఏఎస్పీ రాజేశ్వర్‌రెడ్డి, ఏఎస్ఐ రామకృష్ణారెడ్డిలపై నమోదైన కేసుకు సంబంధించి పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌తో డాక్టర్ సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి చర్చించారు. శనివారం రాత్రి 7గంటల ప్రాంతంలో వీరు డీఎస్పీ కార్యాలయానికి వచ్చారు. డీఎస్పీతో దాదాపు పదినిమిషాలు చర్చించారు. తప్పుడు సాక్ష్యం చెప్పాలంటూ తనపై సునీత, రాజశేఖర్‌రెడ్డి, రామ్‌సింగ్ ఒత్తిడి తెస్తున్నారంటూ వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు 2023లో ఈ ముగ్గురిపై పులివెందులలో కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును హైకోర్టు కొట్టేసింది. ఈ తప్పుడు కేసు నమోదు చేయించడంలో కీలక పాత్ర పోషించిన వారిపై ఇటీవల కేసు నమోదైంది. దీని వివరాలను సునీత అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ కేసు కడప అడిషనల్ ఎస్పీకి బదిలీ చేశారని డీఎస్పీ వారికి వివరించారు. త్వరితగతిన నిందితులకు శిక్షపడేలా చేయాలని సునీత అన్నట్లు సమాచారం.

ఘనంగా సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఛైర్మన్ జయప్రకాశ్‌నారాయణబాబు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సహ కార వారోత్సవాలను జిల్లా సహకార మా ర్కెటింగ్ సొసైటీలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహకార శాఖ అధికారి ఎం.వెంకటసుబ్బయ్య, డీసీఎం ఎస్ ఛైర్మన్ వై.జయప్రకాశ్ నారాయణబాబుతో కలిసి సహకార పతా కాన్ని ఆవిష్కరించారు. సిబ్బందితో కలిసి సహకారగీతాన్ని ఆలపించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డీసీఎంఎస్ ఛైర్మన్ మాట్లాడుతూ సహకార శాఖ ద్వారా అనుబంధ రంగాల ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందుతుందన్నారు. వ్యవసాయంలో సహకార వ్యవస్థ ద్వారా రైతులకు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ ఎల్‌వోపీ గోపీక్రిష్ణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పరిమళజ్యోతి, డీసీఎం ఎస్ బిజినెస్ మేనేజరు ఎండీఎస్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ అరెస్టు

- రూ.1.10లక్షలు రికవరీ : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు, విత్తనాలు, ఎరువుల సబ్సిడీ డబ్బుతో పరారైన విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌ను అరెస్టు చేశామని డీఎస్పీ మురళీనాయక్ పేర్కొన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సింహాద్రిపురం మండలం అంకాళమ్మ గూడూరులో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌గా మల్‌రెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పనిచేస్తున్నాడన్నారు. ఇతను ప్రభుత్వం నుంచి వచ్చిన పింఛన్ల డబ్బు రూ.6.25 లక్షలు, రైతులు విత్తనాల కోసం ఇచ్చిన రూ.10,74,720, ఎరువుల కోసం వచ్చిన రూ.7,27,835.35.. మొత్తం రూ.24,27,555.35తో పరారయ్యాడన్నారు. దీనిపై సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం పులివెందులలోని కడపకు వెళ్లే రింగురోడ్డులో ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి పింఛన్లకు సంబంధించి రూ.60వేలు, రైతులకు సంబంధించి విత్తనాలు, ఎరువులకు వసూలు చేసిన రూ.50వేలు రికవరీ చేశామన్నారు. మిగిలిన డబ్బును ఆన్‌లైన్ గేములకు ఉపయోగించాడన్నారు. ఇతని వద్ద నుంచి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రమణ, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

కడప మారుతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు ఎం.అంజల తెలిపారు. అభ్యర్థులు ఈనెల 17 నుంచి 25వ తేదీ లోపు కడపలోని బీసీ భవన్ (పాతరిమ్స్)లో గల బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. డిసెంబరు 5వ తేదీన స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. అందులో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి విజయవాడ దగ్గర గొల్లపూడిలో ఉన్న బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, మార్కులలిస్టులు, కులధ్రువీకరణ పత్రము, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు జత పరచి ఇవ్వాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయము లక్ష లోపు మాత్రమే ఉండాలన్నారు. ఏదేని ఇతర వివరాలకు నేరుగా మా కార్యాలయంలో గానీ లేదా 9703185382, 9849919221 నెంబర్ల ను సంప్రదించాలన్నారు.

ముగ్గురాయి అక్రమ తవ్వకాలపై విజిలెన్స్ దాడులు

- క్రేన్లు, ఇనుప ప్లాట్‌ఫాంలు సీజ్



అక్రమ మైన్ వద్ద నుంచి క్రేన్, ఫ్లాట్‌పాంను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముగ్గురాయి అక్రమ తవ్వకాలపై భూగర్భగనుల శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు చేశారు. వేంపల్లె మండలంలోని బక్కన్నగారిపల్లె సమీపంలో కడపకు చెందిన వ్యక్తి పేరుతో అనుమతుల్లేని అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ మైన్ వద్ద ఉన్న రెండు క్రేన్‌లను, ప్లాట్‌ఫాంను సీజ్ చేశారు. భూగర్భ గనుల శాఖ విజిలెన్స్ ఇన్‌చార్జి డీడీ ఎం.సుబ్రమణ్యం, విజిలెన్స్ మైనింగ్ ఏజీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆర్డీఓ చిన్నయ్య, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తదితర అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. నాటకీయ పరిణామాల మధ్య క్రేన్‌లను, ప్లాట్‌పాంను తహశీల్దార్ ద్వారా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు రామసుబ్రమణ్యం, విమలమ్మ, సాంకేతిక సహాయకురాలు అమ్మణ్ణి, వీఆర్వోలు, పాల్గొన్నారు. కాగా.. వేంపల్లె మండలం తాళ్లపల్లె వద్ద ముగ్గురాయితో వెళ్తున్న లారీని అధికారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

శిల్పారామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం

కడప కల్చరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కడప శిల్పారామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తా మని శిల్పారామా ల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.స్వామి నాయుడు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన కడప శిల్పారామాన్ని సందర్శించారు. అక్కడి గేట్ ఎంట్రీ, గేమ్స్ ఏరియాలు, బోటింగ్ బ్రిడ్జిని పరిశీలించి సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట సుబ్బయ్యకు పలు సూచనలిచ్చారు. బోటింగ్ పాండ్ మధ్యలో గ్రీనరీ ఏర్పాటుచేసి చిన్నచిన్న బర్త్‌డే ఫంక్షన్ల కోసం అందుబాటులోకి తీసుకు రావాలని చెప్పారు. కడప శిల్పారామానికి ప్రజలు ఎక్కువగా వస్తుండ టంతో దీనిని మరింతగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇక్కడ హ్యాండ్ క్రాఫ్ట్ మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో శిల్పారా మం పరిపాలనాధికారి ఎస్.కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ యశ్వంత్ పాల్గొన్నారు.


యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్టు బస్సు

7

తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడిపై కేసు

మొదలైన సదరం

- ప్రతి మంగళవారం నిర్ధారణ పరీక్షలు
- జిల్లాలో నాలుగుచోట్ల అవకాశం



వల్లూరు సచివాలయంలో సదరం స్లాట్ కోసం ఎదురు చూస్తున్న దివ్యాంగులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాళ్లు, చేతులు, కళ్లు, మానసిక స్థితి సరిగా లేనివారికి ప్రభుత్వం అందించే సదరం ధ్రువపత్రం తప్పనిసరి. ఈ పత్రం ఆధారంగా పింఛను పొందడంతో పాటు చదువు, ఉద్యోగం ప్రయాణాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చే వివిధ సేవలు పొందవచ్చు. ఈ నేపథ్యంలో.. వైకల్యంతో బాధపడుతున్న వారంతా సదరం ధ్రువపత్రాలు పొందేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 14 నుంచి డిసెంబరు వరకు నమోదు చేసుకునే అవకాశం ఇచ్చింది. సదరం ధ్రువపత్రం అవసరం ఉన్నవారు మీసేవ, సచివాలయాలకు వెళితే.. అక్కడ సిబ్బంది వచ్చిన వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని ఆయా ఆసుపత్రుల్లో ఖాళీల తేదీలను పరిశీలించి స్లాట్ బుక్‌చేస్తారు. ప్రతి మంగళవారం అసెస్‌మెంటు, స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూలు ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలంటూ వైద్యాధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. సదరం శిబిరాలకు ఎలాంటి ఆటంకం ఏర్పడకుండా నిరంతరాయంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. శిబిరాల సమయంలో వికలాంగులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

సదరం కేంద్రాలు ఇవే..

స్లాట్ బుక్ చేసుకున్న వారికి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, కడప రిమ్సలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. శారీరక వైకల్యం ఉన్న వారికి జమ్మలమడుగులోని ఏరియా హాస్పిటల్‌లో, ప్రొద్దుటూరులోని జిల్లా ఆసుపత్రిలో, కడప రిమ్స్‌లో.. ఒక్కోచోట 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. నేత్ర సంబంధిత పరీక్షలను ప్రతి మంగళవారం ప్రొద్దుటూరు, పులివెం దుల, కడప రిమ్స్‌లో.. ఒక్కోచోట 15 మందికి పరీక్షలు నిర్వహించనున్నారు. విని కిడిలోపం ఉన్నవారికి ప్రతి మంగళవారం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో 30 మందికి, కడప రిమ్స్ ఆసుపత్రిలో 30 మందికి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. మెడికల్ రిటార్డేషన్‌కు సంబంధించి ప్రతి మంగళవారం కడప రిమ్స్‌లో 10మందికి, మానసిక అనారోగ్యం ఉన్నవారికి కడప రిమ్స్‌లో 10 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు.

సాంకేతిక సమస్యలు..

సదరం స్లాట్ బుక్ చేసుకునేందుకు మీసేవ, సచివాలయాలకు వెళ్లిన వారికి సాంకేతిక సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. చాలా వరకు స్లాట్స్ అందుబాటులో లేనట్లు చూపించాయి. దీంతో సదరం క్యాంపులకు హాజరు కానున్న వారిలో ఆందోళన నెలకొంది.

గంజాయి ముఠా అరెస్టు

- నిందితులలో మెడికల్ షాపు యజమాని, రౌడీషీటరు
- 23.580 కిలోల గంజాయి, 1620 మత్తు ట్యాబ్లెట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



నిందితుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు ట్యాబ్లెట్లు యువతకు అమ్ముతున్న 9 మందిని రిమ్స్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో పలు నేరాలకు పాల్పడిన రౌడీషీటర్‌తో పాటు కర్నూలుకు చెందిన మెడికల్ షాపు యజమాని ఉన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబుతో కలిసి శనివారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

కడప చిన్నచౌకుకు చెందిన సురభి మహేశ్‌పై పులివెందులలో ఓ హత్య కేసు, ప్రొద్దుటూరులో కార్ల దొంగతనం, కిడ్నాప్, తిరుపతిలో దోపిడీ, చాపాడులో హత్యాయత్నం, పెండ్లిమర్రిలో దొంగతనం, సిద్దవటంలో ఐచర్‌లారీ దొంగతనం కేసులతో పాటు.. జమ్మలమడుగు, కడప, కర్నాటకలోని పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇతనిపై చిన్నచౌకు పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉంది. మహేశ్ కడపలోని కొంతమంది యువకులను గ్యాంగ్‌గా ఏర్పాటు చేసుకుని ఒడిషా రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్ నుంచి గంజాయి తెప్పించి వారికి ఇచ్చేవాడు. ఆ గ్యాంగ్‌లోని వారు గంజాయిని పొట్లాలుగా కట్టి యువతకు విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడుతున్నారు. గంజాయితో పాటు మత్తు ట్యాబ్లెట్లు కూడా యువతకు అమ్ముతూ వస్తున్నారు.

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రిమ్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్‌తో కలిసి ప్రత్యేక టీం ఏర్పాటు చేసి గంజాయిపై నిఘా ఉంచారు. శుక్రవారం మధ్యాహ్నం గంజాయి, మత్తు ట్యాబ్లెట్లు వేరే రాష్ట్రం నుంచి తీసుకువచ్చి డీటీసీ సర్కిల్ వద్ద పంచుతుండగా వారిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మహేశ్‌ను విచారించగా కర్నూలుకు చెందిన మెడికల్ స్టోర్ నాగేంద్ర ద్వారా మత్తు ట్యాబ్లెట్లు కడపకు తెస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో నాగేంద్రను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.1.15 లక్షల విలువ చేసే 23.500 కిలోల గంజాయి, రూ.9,600 విలువ చేసే 1,620 మత్తు ట్యాబ్లెట్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, మత్తు ట్యాబ్లెట్లు

నిఘా ఉంచుతాం

గంజాయి విక్రయాలపై ప్రత్యేక టీంలతో నిఘా ఉంచామని ఎస్పీ తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం గంజాయి విక్రయాలు తగ్గాయన్నారు. మత్తుకు అలవాటు పడ్డ వారిని గుర్తించి రీహాబిలిటేషన్ సెంటరుకు తరలిస్తున్నామన్నారు. యువత మత్తు ట్యాబ్లెట్లను ఇంజక్షన్ల రూపంలో కూడా తీసుకున్నట్లు తమ దృష్టికి రావడంతో వాటిపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా గంజాయి, మత్తు ట్యాబ్లెట్లు వినియోగిస్తున్నట్లు సమాచారం వస్తే 112కు కానీ, నేరుగా తనకు కానీ, సంబంధిత పోలీసుస్టేషన్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నిందితులు వీరే..

గంజాయి విక్రయిస్తున్న వారిలో ప్రధాన నిందితుడు కడప చిన్న చౌకులోని భాగ్యనగర్ కాలనీకి చెందిన సుర భి మహేశ్‌తో పాటు వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రజాక్, నిరంజన్‌నగర్‌కు చెందిన కాకాని శివకుమార్, ఎర్రముక్కపల్లెలోని నాగుల కట్టకు చెందిన పులి వీరమణికంఠ, తిలక్ నగర్‌కు చెందిన షేక్ అల్తాఫ్, బీకేయం స్ట్రీట్‌కు చెందిన పఠాన్ మన్సూర్ ఖాన్ అలియాస్ మన్సూర్‌ను అరెస్టు చేశారు. అలాగే సీకేదిన్నె మండలం మద్దిమడుగు కు చెందిన ఆటో డ్రైవరు షేక్ రహ్మతుల్లా, నరసరామయ్యగారిపల్లెకు చెందిన సోము శివప్రశాంత్ అలియాస్ ప్రశాంత్, కర్నూలు జిల్లా సీతారామనగర్‌కు చెంది న మెడికల్ స్టోరు యజమాని సన్నిధి నాగేంద్రగుప్త అలియాస్ నాగేంద్ర అరెస్టయ్యారు.

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొన్న టూరిస్టు బస్సు

- ట్యాంకర్‌కు లీకేజీ.. యాసిడ్‌ను నిలువరించలేక
- రోడ్డు పక్కకు ట్యాంకర్ తరలింపు



ఘటనా స్థలంలో ట్యాంకర్ నుంచి లీకవుతున్న యాసిడ్

పీలేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద శనివారం వేకువ జామున యాసిడ్ ట్యాంకరును టూరిస్టు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదం కారణంగా ట్యాంకరులోని ద్రవం లీకవడం, దానిని పెట్రోలుగా భావించడంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే అది పెట్రోలు కాదు, యాసిడ్ అని నిర్ధారణ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాదు నుంచి తమిళనాడులోని వేలూరుకు యాసిడ్ తీసుకెళుతున్న ట్యాంకరును తూర్పుగోదావరి జిల్లా నుంచి అయ్యప్పస్వాములతో శబరిమలైకు వెళుతున్న ట్రావెల్స్ బస్సు ఉదయం 4.30 గంటల ప్రాంతంలో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాద తాకిడికి ట్యాంకరుకు లీకేజీ ఏర్పడడం, ఆ ట్యాంకరు నుంచి లీకవుతున్న ద్రవం ఘాటు వాసన కలిగి ఉండడం, కళ్లు మంటలు రావడంతో భయపడిన అయ్యప్పస్వాములు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే ట్యాంకరు లీకేజీని నిలువరించే అవకాశం లేకపోవడంతో యాసిడ్ పూర్తిగా ఖాళీ అయ్యేందుకు ట్యాంకరును అధికారులు రోడ్డు పక్కన ఉన్న బహిరంగ ప్రదేశానికి తరలించారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

పులివెందుల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నరంగాపురంలో శుక్రవారం రాత్రి వంశీకృష్ణ యాదవ్‌ను కత్తితో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నిందితుడు పప్పూరి రవీంద్రను శనివారం ముద్దనూరు రింగురోడ్డులో అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా అవమానం జరగడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు రవీంద్ర తెలిపారన్నారు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడిపై కేసు

నిమ్మనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తల్లి దండ్రులను వేధిస్తున్న కుమారుడు, అతని భార్య, బంధువులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వెంగంవారిపల్లి పంచాయతీ బండకిందహరిజనవాడ వాసి బిరసలపాటి యర్రప్పకు ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి కుమారుడు దొరస్వామి ఉద్యోగ రిత్యా బయటి దేశంలో ఉన్నాడు. చిన్నకుమారుడు గౌరేంద్ర అదే గ్రామానికి చెందిన శ్రీదేవిని వివాహం చేసుకున్నాడు. అయితే కొంతకాలంగా తల్లి సీతమ్మ, తండ్రి యర్రప్పను తనకు రావాల్సిన ఆస్తిని రాసివ్వాలంటూ వేధిస్తున్నాడని వాపోయారు. అలాగే బంధువులైన చంద్రమ్మ, వెంకట రమణారెడ్డి, వెర్రి రమణారెడ్డితో కలిసి తన ఆస్తిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈమేరకు గౌరేంద్ర, శ్రీదేవి, బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు ఖాతాలో రూ.2లక్షల మాయం

వాల్మీకిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా నుంచి రూ.2లక్షలు మాయమైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు చింతపర్తి వాసి, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ తెలుగు రైతు కార్యదర్శి కలికిరి సుధాకర్‌రెడ్డికి సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. అయితే శుక్ర, శనివారాల్లో తన ఖాతా నుంచి రూ.2లక్షలు నగదు మాయమైనట్లు శనివారం గుర్తించారు. శుక్రవారం ఐదుసార్లు, శనివారం ఆరుసార్లు తన ఖాతా నుంచి ఆన్‌లైన్ ద్వారా నగదు డ్రా చేసినట్లు గుర్తించి బ్యాంకు మేనేజర్, ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశాడు.

రైలుకింద పడి యువకుడు మృతి

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి రైలుకింద పడి మహేష్ (26) అనే యువకుడు మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లావనూరు గ్రామానికి చెందిన రాయుడు కుమారుడైన మహేష్ శుక్రవారం రాత్రి లావనూరు నుంచి బస్సులో వచ్చి, కొండాపురం రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్సు రైలుకింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇతను ఇంటర్ వరకు చదువుకున్నాడని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ పక్షిని వేటాడిన వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన వ్యక్తిని చూపుతున్న అటవీశాఖ అధికారులు

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె అటవీ శాఖ రేంజ్ పరిధి చక్రాయపేట మండలం ఫారెస్టు బీట్ కొండావాండ్లపల్లె సమీపంలో జాతీయపక్షి నెమలిని వేటాడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పాపాఘ్ని నది సమీపంలోని కొండవాండ్లపల్లె గ్రామం వద్ద నెమలిని వేటాడినట్లు సమాచారం రావడంతో డీఆర్వో వెంకటసుబ్బయ్య తనిఖీలు నిర్వహించారు. వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన మేదరి గంగన్నను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో షంషుద్దీన్

మైలవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పది ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల జడ్పీ హైస్కూలును తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, రికార్డులు, ఉపాధ్యాయుల బోధన తీరు, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 10వ తరగతిలో డి-గ్రేడ్ పిల్లలను ఎ,బి గ్రేడ్‌లు వచ్చేటట్లు, ఎ,బి గ్రేడ్ పిల్లలను అత్యుత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఇటీవల ఢిల్లీ సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు వెళ్లి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండెట్స్ క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో నిలిచిన 9 తరగతి విద్యార్థులు నందిని, ముఖేష్‌లను డీఈవో అభినందించారు. వీరు రాష్ట్రస్థాయి ర్యాంకులకు కృషి చేసిన ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిన్ననరసమ్మను సన్మానించారు. అలాగే వీవీఎం పోటీల్లో మొదటిస్థాయిలో విజయం సాధించిన 11 మంది ఆరవ తరగతి విద్యార్థులను కూడా డీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జడ్పీ స్థలాలను పరిరక్షించాలి : సీపీఐ జిల్లా కార్యదర్శి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విలువైన జిల్లా పరిషత్తు స్థలాల్లో వాణిజ్య సముదాయాల పేరుతో కబ్జాచేసేందుకు అధికారులు, అధికారపార్టీ నేతల యత్నాలను సాగనివ్వబోమని జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 16న జిల్లా పరిషత్ సీఈఓ పేరుతో నాగరాజుపేట వద్ద, ఆహార భవన్ పక్కన రెండు ఎకరాల జిల్లా పరిషత్తు స్థలంలో, కళాక్షేత్రం పక్కన ఏడు సెంట్ల స్థలంలో ఎవరైనా వాణిజ్య అవసరాల కోసం, కార్పొరేట్ విద్యాసంస్థల ఏర్పాటు కోసం వారు కోరిన విధంగా నిర్మించి కట్టబెట్టేందుకు పేపర్ ప్రకటన విడుదల చేసిందన్నారు. విడుదల చేసిన రెండు రోజులకే నాగరాజుపేట వద్ద ఉన్న రెండు ఎకరాలలో రూ.1,24,47,587 అంచనా వ్యయంతో నిర్మాణాలు, కళాక్షేత్రం వద్ద ఏడు సెంట్లలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో వాణిజ్య సముదాయం నిర్మాణానికి టెండర్లు పిలిచి అధికారపార్టీకి చెందిన వ్యక్తికి కట్టబెట్టారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ జిల్లా పరిషత్తు నియమ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారన్న ఆరోపణలతో రద్దు చేసినట్లు సమాచారం ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఒక ప్రైవేట్ కళాశాల యాజమాన్యంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్న అప్పటి సీఈఓ సుధాకర్‌రెడ్డి ఎలాంటి వేలం ప్రకటన లేకుండానే ఏకపక్షంగా కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆందోళన చేపట్టిందన్నారు. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకున్న చందాన ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ అండదండలతో అధికారులను ప్రలోభపెట్టి విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా స్థలాల కేటాయింపు కోసం ప్రకటనలు, టెండర్లు పిలిచిన జడ్పీ సీఈఓ ఓబుళమ్మపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్లాస్మా ట్రీట్‌మెంట్‌తో అధిక దిగుబడి

- ఐఐఎస్‌సీ బెంగళూర్ ప్రొఫెసర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్మా ట్రీట్‌మెంట్ చేయడం ద్వారా పంటల దిగుబడి పెంచవచ్చని బెంగుళూర్ ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ బీఎస్ రజనీకాంత్ అన్నారు. శనివారం వైవీయూలో విత్తనాల ప్లాస్మా ట్రీట్‌మెంట్ అనే అంశంపై శాస్త్రీయ ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్ విద్యార్థులు ఐఐఎస్‌సీలో ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నందుకు వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో జెనిటిక్స్ జీనోమిక్స్ హెడ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మునికుమారి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించగా డాక్టర్ రమేష్, డాక్టర్ ఎల్.దాక్షాయిని, డాక్టర్ పి.ఉస్మాన్‌బాష, మైక్రోబయలజీ హెడ్ డాక్టర్ శుభోష్‌చంద్ర సహకారం అందించారు. ఈ సెమినార్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, పీఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ విజయరాఘవ ప్రసాద్, ప్రొఫెసర్లు, బోధన బోధనేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించండి



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ

దువ్వూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సీఈవో ఓబుళమ్మ సూచించారు. దువ్వూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నీటి సరఫరాకు సంబంధించి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరచడం, లీకేజీలు ఉంటే నివారించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణయాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు

పీలేరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2600 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు మదనపల్లె డీవైఈఓ వై.లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా సమ్మిళిత విద్యాశాఖ అధికారి కొన్నిపాటి జనార్థన్ తెలిపారు. శనివారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరంలో వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో 673 మంది భవిత కేంద్రాల్లో చదువుతున్న వారు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 2300 పాఠశాలలు, 30 భవిత కేంద్రాలున్నాయని, నియోజకవర్గానికి ఒక రోజు చొప్పున ప్రత్యేక ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన పిల్లలకు వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్లు, ట్రై సైకిల్స్, ఎంఆర్ కిట్స్ తదితర పరికరాలు అందజేసేందుకు ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గండి దేవస్థానంలో అభివృద్ధి పనుల పరిశీలన



అంజన్నను దర్శించుకుంటున్న గురుప్రసాద్

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గండి దేవస్థానాన్ని శనివారం దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయనను సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజా రమేష్, గోపాలస్వామి సాదరంగా ఆహ్వానించి పూజలు చేశారు. అనంతరం ఆయన గండి దేవస్థానంలో జరిగే అభివృద్ధి పనులను పరిశీలించారు. గుడి ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవదాయశాఖలో పనిచేసే ఉద్యోగుల గురించి ఆరా తీశారు. మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, వేద పారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, సూపరింటెండెంట్ సుభాష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరాముని సన్నిధిలో భారత్ సాఫ్ట్‌బాల్ కోచ్



కోదండరాముని సన్నిధిలో బద్రి

ఒంటిమిట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని భారత్ సాఫ్ట్‌బాల్ కోచ్ బద్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం కోచ్ బద్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వివరించారు. ఆలయంలో శిల్పసంపద అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు. భారత సాఫ్ట్‌బాల్ టెక్నికల్ రెఫరీ నారాయణ, ఉమ్మడి కడప జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంక్షలు పేదలకు భారం కాకూడదు

- వైద్యాధికారులను ప్రశ్నించిన కాంగ్రెస్, సీపీఐ నాయకులు



స్కానింగ్‌ల నిర్వహణపై జిల్లా ఆస్పత్రి ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్యసేవల కోసం జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించే పేద, మధ్యతరగతి ప్రజలకు ఇక్కడి ఆంక్షలు భారం కాకూడదని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష, పట్టణాధ్యక్షుడు గోసంగి వెంకటసుబ్బారెడ్డి, సీపీఐ నాయకులు సుబ్బరాయుడు అన్నారు. శనివారం జిల్లా ఆస్పత్రిని సందర్శించిన వారు అక్కడికి వచ్చిన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమశ్రీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతలకు ప్రజల సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని కోరారు. జిల్లా ఆస్పత్రిలో అందని ద్రాక్షలా మారిన ఎంఆర్ఐ, సిటీస్కానింగ్‌ల నిర్వహణపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికల్లో శనివారం 'స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఆస్పత్రిని సందర్శించి.. అక్కడి తీరుతెన్నులపై ప్రశ్నించారు. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పుడు దాన్ని సవరించాలే తప్ప నిర్వీర్యం అయ్యేలా చేయడం ఎంతవరకు సబబు అన్నారు. సామాన్య ప్రజలు రోజుల తరబడి ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా సిటీ, ఎంఆర్ఐ సేవలు దక్కకపోవడం బాధాకరమైన విషయమన్నారు. రెండు రోజులపాటు అడ్మిట్ అయితే కానీ స్కానింగ్ రాస్తామని చెప్పేందుకు సంబంధించి రాత పూర్వక ఆదేశాలు ఉన్నాయా అంటూ నిలదీశారు. సామాన్యుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని నియమాలను సవరించి మెరుగైన వైద్యం అందరికి అందించే బాధ్యత వైద్యాధికారులతో పాటు ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రైవేటు భాగస్వామ్యం పేరిట రోగుల వద్ద నుంచి బహిరంగంగా రుసుము వసూలు చేయడమే కాక వాటికి సంబంధించిన రశీదులను కూడా ఇస్తున్నారని చెప్పారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐకి సంబంధించి ఫిల్మ్‌లను ప్రింట్‌లు వేసి అమ్ముకునే అనుమతులు ఎక్కడున్నాయో చూపించాలని నిలదీశారు. ప్రైవేటు సర్వీసులు, ఫిల్మ్‌ల అమ్మకాల పేరిట సుమారు రూ.7 కోట్లు డబ్బులు ఏ ప్రాతిపదిక మీద ప్రజల వద్ద నుంచి వసూలు చేశారో సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమశ్రీ మాట్లాడుతూ ఆస్పత్రిలో సేవలు పొందే రోగులకు నిర్వహించే వైద్య నిర్ధారణ పరీక్షల్లో వైద్యుల అవగాహన కోసం నివేదికలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, రోగుల చేతికి ఇవ్వాలన్న నిబంధన లేదని చెప్పారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ విభాగాల్లో పెయిడ్ సర్వీసులు కూడా ఉండడంతో ప్రింటింగ్ మిషన్ అనుమతిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టత తీసుకుంటామన్నారు. పేద ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఆస్పత్రి వైద్యులతో సమావేశమై తగిన సూచనలు జారీ చేస్తామన్నారు.

ఫసల్ సాంకేతికత రైతులకు ఎంతో ఉపయోగకరం

కడప రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఫసల్ సంస్థ అభివృద్ధి చేసిన సాంకేతికత రైతులకు విశేషంగా ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరు ప్రసంసించారని ఫసల్ టీమ్ స్టేట్ హెడ్ అనిల్‌నాయక్, టెరిటరీ మేనేజర్ విఘ్నేష్‌లు తెలిపారు. ఈ సాంకేతికతను ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విస్తృతంగా పరిచయం చేయాలని కలెక్టర్ సూచించారన్నారు. శనివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. ఈ సందర్భంగా ఫసల్ అభివృద్ధి చేసిన స్మార్ట్ వ్యవసాయ పరికరాల వినియోగం, వాటి ప్రయోజనాలు, ఉద్యాన పంటలు, కూరగాయపంటల్లో ఆటోమేటెడ్ ఇరిగేషన్-ఫర్టిగేషన్ సిస్టమ్‌ల అమలు విధానాలపై సమగ్రంగా వివరించామన్నారు. అలాగే మట్టితేమ, ఉష్ణోగ్రత, ఆర్ద్రత, ఆకుతేమ తదితర కీలక సమాచారాన్ని రైతులకు తెలియజేసి శాస్త్రీయ సాగు నిర్ణయాలు తీసుకునేలా సహకరిస్తున్న ఫసల్ సాంకేతికత ప్రయోజనాలను కలెక్టర్‌కు తెలియపరిచామన్నారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తాగే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి, బహిరంగ మద్యపానం చేసే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ అమర్‌నాథరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు. శనివారం నగరంలోని బుగ్గవంక పరీవాహక ప్రాంతం, గుర్రాలగడ్డ, పాతబస్టాండు వెనక ప్రాంతం పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం జరిగింది.

నేరాల నియంత్రణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి రికార్డులు లేనివారికి జరిమానాలు విధిస్తున్నారు. అంతేకాకుండా విజిబుల్ పోలీసింగ్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత నిబంధనలపై. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విజిబుల్ పోలీసింగ్ కొనసాగిస్తున్నారు.

ప్రజల కోసం ట్రాఫిక్ అవగాహన

కడప క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలో వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణభద్రత కోసం ట్రాఫిక్ నియమాలను త ప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి ధరించాలన్నారు. ముఖ్యంగా రద్దీ రోడ్లలో నెమ్మదిగా, జాగ్రత్తగా డ్రైవ్ చేయాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలన్నారు. మొబైల్ మాట్లాడుతూ డ్రైవ్ చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

వల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పెద్ద ఓబన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దలేబాక కేబీ జయనగర్ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా ఎవరితో కూడా ఫోనుకు వచ్చిన ఓటీపీలు, అకౌంట్లు నెంబర్లు చెప్పకూడదన్నారు. మహిళలు బయటికి వెళ్లేటప్పుడు నగలు వేసుకుని వెళ్లరాదన్నారు. ఏదైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలి

పులివెందుల రూరల్,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ఒకవైపు, మద్దతు ధర లేక మరోవైపు రైతులు తీవ్రంగా నష్టపోయారని తక్షణం ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్నికల హామీ సందర్భంగా ఇచ్చిన నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రారంభించి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యావ్యవస్థ నాశనం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రంలో విద్యావ్యవస్థ నాశనమౌతోందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఏ పరీక్షల ప్రశ్నపత్రాల రూపకల్పన ఘోరంగా ఉందన్నారు. 1, 2 తరగతుల విద్యార్థులకు 8 పేజీల ప్రశ్నాపత్రాలు ఇచ్చారని, ఆ స్థాయిలోని విద్యార్థులు దానిని ఎలా చదివి రాయగలరని ప్రశ్నించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం, అభివృద్ధి





చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, పులివెందులలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చెన్నూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతతోనే ఆరోగ్యం, అభివృద్ధి ఉంటాయని ప్రతి గ్రామ పంచాయతీలో ఇందుకు ప్రాధాన్యతనివ్వాలని ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రపై సమావేశం, ర్యాలీ నిర్వహించారు.సర్పంచ్ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, డిప్యూటీ ఎంపీడీవో గురువేశ్వర్ రావు, వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పులివెందుల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (రమణప్పసత్రం)లో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు, ఎంఈఓ రామానాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

పులివెందుల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం-పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఆహార విజ్ఞాన శాస్త్ర ,సాంకేతిక కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎమ్.మాధవ సూచించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జయమ్మ, ఇంజనీర్ నజ్మా, అధ్యాపకులు డాక్టర్ సాయి శ్రీనివాస్, ఎన్‌వీ సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు నాయకత్వం వహించారు. న్యూ ఆర్ట్స్ బిల్డింగ్ పరిసరాల్లో ఉన్నప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించడంతో పాటు పెరిగి ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లమొక్కలను విద్యార్థులు, సిబ్బంది కలిసికట్ చేసి మొత్తం ప్రాంగణాన్ని పరిశుభ్రంగా మార్చారు. ప్రొఫెసర్ వినోదిని, నారాయణ రెడ్డి, సుశీల్‌కుమార్, క్రిష్ణయ్య, రాజేశ్వరి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పులివెందుల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం 4వ సోమవారం సందర్భంగా పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి పలు శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రేమ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం పులివెందుల డిపో నుంచి శ్రీశైలం,భాను కోట, గురజాల (గునికుంట్ల), మోపూరు దేవళాలకుబస్సులు ఏర్పాటుచేశామన్నారు.

గండి క్షేత్రంలో అన్నదానం

చక్రాయపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి వారం సందర్భంగా గండి క్షేత్రంలో ఉత్తరప్రదేశ్ వాసి రామ్‌దిన్ అనే అంజన్న భక్తుడు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం శనివారం చేపట్టారు.ఉదయం 10గంటలకు ప్రారంభించి రాత్రి 8గంటల వరకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గండి ఈఓ వెంకటసుబ్బయ్య, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, రామ్‌దిన్ బంధువులు, రాజనరసింహారెడ్డి, త్రివేణి, పద్మావతి,పూర్విక, గ్రీష్మంత్‌రాజ, రామ్‌దిన్ మిత్రులు,ఆలయనిర్వాహకులు పాల్గొన్నారు.

సొంత నిధులు ఏర్పాటు : బీటెక్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

సింహాద్రిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంకాళమ్మగూడూరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం జరిగేందుకు మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) రూ. 15 లక్షలు తన సొంత నిధులు ఏర్పాటు చేస్తున్నట్లు సమావేశంలో ప్రకటించారు. శనివారం సాయంత్రం అంకాళమ్మగూడూరు సచివాలయ ఆవరణలో అధికారులతో కలిసి బీటెక్ రవి నష్టపోయిన రైతులకు సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి రైతులకు డబ్బులు పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆయన సూచించారు. బీటెక్ రవి సొంత నిధులు పంపిణీకి సిద్ధమైనందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పులివెందుల ఆర్డీఓ జి. చిన్నయ్య, తహసీల్దార్ సాయినాథరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ రామాంజులరెడ్డి, టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు ఫైనాన్స్‌పై అవగాహన

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంస్థ ఆర్థిక పనితీరు కొలవడంలో ముందుచూపు పాలన నైపుణ్యత అవసరమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇరాల లోకానందరెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఎంబీఏ శాఖలో శనివారం ఫైనాన్స్ అంశంపై అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ పి.సరిత, ఇతర అధ్యాపకులు,ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సంగమేశ్వరుని కల్యాణం

వీరపునాయునిపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని సంగమేశ్వర ఆలయంలో నాలుగో కార్తీక సోమవారం పురస్కరించుకొని సంగమేశ్వరునికి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రాంగణంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి కళ్యాణాన్ని జరుపుతున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 1 నుంచి ఆలయం చుట్టూ రథోత్సవం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

చిత్రాలు అత్యంత అద్భుతం

ముగిసిన ఫైన్ ఆర్ట్స్ వర్క్‌షాప్



చెక్కపై వేసిన చిత్రం గురించి వివరిస్తున్న ఫైన్ ఆర్ట్స్ విద్యార్థి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వుడ్ కట్ పెంచింగ్ చిత్రాలు అత్యంత అద్భుతంగా ఉన్నాయని సౌందర్యాత్మక విలువలు, సృజనాత్మకతకు ప్రతీకలుగా ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల చిత్రాలు నిలుస్తున్నాయని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ అన్నారు. శనివారం వైవీయూ లలిత కళా విభాగంలో వారంరోజుల ఇంక్ ఏ పేరుతో ప్రింట్ మేకింగ్ వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు వుడ్ కట్, పెంచింగ్ ద్వారా తయారుచేసిన చిత్రాలు ఆహుతులను కట్టిపడేస్తున్నాయన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్, లలిత కళల శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ వారం రోజులపాటు విద్యార్థులు కష్టపడ్డారని



అందుకు నిదర్శనమే ఈ చిత్రాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్ మేకింగ్ నిపుణుడు,కళాకారుడు చలపాక అప్పలాచారి మాట్లాడుతూ ,అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, బి.ఈరప్ప, ఎం.వాసవి, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి బరుణ్ మాట్లాడారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాఘవేంద్ర

సీకేదిన్నె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి వైద్యురాలు కవితారాణి, వైద్య సిబ్బంది , గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా స్థానిక ఎన్నికలకు

సిద్ధపడడం రాజ్యాంగ విరుద్ధం

కడప మారుతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కుల జనగణనతో పాటుగా ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధపడడం రాజ్యాంగ విరుద్ధమని ఏపీ బీసీ. సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యా సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి త్రివిక్రమ్ పేర్కొన్నారు ఆ మేరకు శనివారం స్థానిక పాత రిమ్స్ లోని బీసీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కుల జన గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారని గుర్తుచేశారు. ఆ పిల్ విషయంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ధర్మాసనం వచ్చే బుధవారం విచారణ జరుపనుందన్నారు.కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలనే నిర్ణయాన్ని పునఃపరిశీలించి బీసీ కుల జనగణన చేపట్టిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సంఘం నగర కమిటీ నాయకులు హరికుమార్, సూరీడు, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న మహిళలు, కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

లింగాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శివపార్వతుల కల్యాణాన్ని శనివారం దిగువ లింగాల కోదండరామాలయంలో గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. శివపార్వతులకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు గ్రామస్థులు అన్నదానం చేశారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ గుప్త

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపందించుకోవాలని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ గుప్త, బెంగళూరు గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్లు రామ్‌కుమార్, విష్ణులక్ష్మణ్ పేర్కొన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని విద్యార్థులకు ఉన్నత విద్యపోటీ పరీక్షల విభాగపు అధికారి కోనప్ప ఆధ్వర్యంలో బెంగళూరు గీతం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు మనలోని నాయకుడిని వెలికితీయడం అనే అంశంపై విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, ఎంపీడీఓ కుళాయమ్మ తెలిపారు. వేంపల్లెలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పనులను పరిశీలించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ రామ్మోహన్‌రెడ్డి, ఈఓ నాగభూషణంరెడ్డి, చెత్త సంపద కేంద్రం ఇన్‌చార్జి వల్లి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు నామా వేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

• డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాజ్యలక్ష్మి

పెండ్లిమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతిమహిళ మంచి జీవనోపాధి కలిగి ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి తెలిపారు.మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శనివారం జెండర్ రిసోర్స్ సెంటర్‌ను పీడీ ప్రారంభించారు.అనంతరం మండల సమాఖ్య వార్షిక మహాసభ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తోందని అవకాశాలను అందుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు.ముఖ్యంగా ఈ జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించడం మహిళలు ఏదైనా ఇబ్బందులకు గురైనపుడు ఆశ్రయిస్తే వారికి అండగా ఉంటుందన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని చాలా మంది డ్వాక్రా సభ్యులు చేస్తున్నారన్నారు.త్వరలో మండలంలో స్మార్ట్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించేందుకు వంట ఏజెన్సీల బాధ్యత మండల సమాఖ్యలకే అప్పగిస్తారన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ప్రసాద్, ఎంపీడీఓ జగన్‌మోహన్,ఏపీయంలు బాలస్వామి, భాగ్యమ్మ, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంకన్న ప్రాకారోత్సవ పూజలు

వేంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం పురస్కరించుకొని ప్రాకారోత్సవ పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను ప్రాకారం చేశారు.

'స్పీకర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు'

కమలాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అమలులో ఉన్న చట్టాలను తుంగలో తొక్కి విశాఖ బీచ్‌లో పెగ్గులు వేసే సంస్కృతి రావాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం సిగ్గు చేటని వైసీపీ రాష్ట్ర ఎస్ఈసీ సభ్యుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమలాపురంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

24వరకు డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరడానికి స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 17నుండి 24వ తేదీలోపు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరైతే సీటు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు

కొండాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని మండల వ్యవసాయాధికారి ఏవీ రామాంజులరెడ్డి తెలిపారు. ఈ-క్రాప్ ఎలో తమ పేర్లను నమోదు చేసుకుని, ప్రభుత్వ మద్దతు ధరకు తమ వరి ధాన్యం అమ్మాలనుకున్న రైతులు రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గ్రేడ్-1 రకం వరికి రూ.2389 (100 కేజీలు), సాధారణ రకం వరికి రూ.2369 (100 కేజీలు) ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మండలానికి సంబంధించి ఏటూరు రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏవో తెలిపారు.

దువ్వూరు ఎస్‌ఐగా ధనుంజయుడు

దువ్వూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దువ్వూరు ఎస్‌ఐగా ధనుంజయుడు నియమితులయ్యారు. ప్రొద్దుటూరు నుండి ఇక్కడికి వచ్చిన ధనుంజయుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై దృష్టి సారిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు. మట్కా, జూదం అసాంఘిక కార్యకలాపాలను అరికడతామని తెలిపారు.

అనాథ ఆశ్రమం తనిఖీ



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి

ఎర్రగుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పలూరు వద్ద ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథ ఆశ్రమాన్ని కమలాపురం జడ్జి మధుసూదన్‌రావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధుల బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో పరిశుభ్రత బాగుందని, వృద్ధులకు సేవ చేయడం పుణ్యకార్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లు అక్రమాల వల్లే.. మున్సిపల్ ఉద్యోగులపై చర్యలు : ఎమ్మెల్యే వరద



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరు మున్సిపాలిటీని అక్రమాలకు నిలయంగా మార్చినందువల్లే 43 మంది మున్సిపల్ అధికారులు, ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఒక బీసీ మహిళను డమ్మీగా పెట్టి రాచమల్లు, అతని బావమరిది మున్సిపాలిటీని దోచుకుతిన్నారన్నారు. ముగ్గురు కమిషనర్లు, ఈఈలు, డీఈలు, ఏఈలు, ఇంజనీర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులతో పాటు అనేక మంది మున్సిపల్ సిబ్బంది ఈ అక్రమాల్లో పాలుపంచుకున్నారని నేడు ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్‌కుమార్ చార్జ్‌స్ ఎందుకు ఫ్రేమ్ చేశాడని, దీనికి రాచమల్లు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. రాచమల్లు అవినీతి పాలనను సమర్థించడం వలన మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు బలికావాల్సి వచ్చిందన్నారు. 27 ఏళ్ల తన రాజకీయ చరిత్రలో ఎక్కడైనా అవినీతి మరకలు వుంటే చూపించాలని సవాలు విసిరారు. తన మీద గానీ, తన కుమారుడు కొండారెడ్డి మీద గానీ నిరూపిస్తే రాజకీయాలను నుండి శాశ్వతంగా తప్పుకుంటానన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ కొండయ్య, ఘంటశాల వెంకటేశ్వర్లు, వద్ది బాలుడు, కమాల్ బాషా పాల్గొన్నారు,

పారిశుధ్యం మెరుగుపరచాలి

ప్రొద్దుటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుధ్యం మెరుగుపరచాలని, లేకుంటే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలన్నారు. పట్టణంలో ఎక్కడా చెత్త పాయింట్లలో చెత్తను ఎప్పటికప్పుడు ఖాళీచేయించి కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, పట్టణంలో వున్న గుంతలను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలన్నారు. సమావేశంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నూర్ బాషా, ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, ఏసీపీ నాగరాజు, డీఈ రాజేష్, ఏఈ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్య సంరక్షణ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాయలసీమ వ్యాయామ విద్యా కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, సిబ్బంది చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు రవిశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన ఇంటర్వ్యూల మేరకు వెంటనే మంజూరు చేయాలని వైసీపీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు నేళ్లపల్లి శివరాం, రాష్ట్ర బీసీసెల్ సెక్రటరీ గజ్జెల లక్షుమయ్య డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 50 సంవత్సరాలు నిండిన బీసీలకు పింఛన్లు, అలాగే రక్షణ చట్టం చేస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరీనాథ్, బీసీసెల్ జిల్లా కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపాలిటీ బస్టాండ్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ శేషఫణి, తహసీల్దార్ శోభన్‌బాబు శనివరం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఇక్కడి భోజనం కోసం వచ్చిన వారిని భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పేదలు, శ్రామికులు అన్న క్యాంటీన్‌కు వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ శోభన్‌బాబుతో కలిసి ఆయన భోజనం చేశారు. క్యాంటీన్‌లో కలియతిరిగి అక్కడి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించుకోవాలని ఆదేశించారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

మైదుకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ రమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అంకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, డ్రైవర్ పక్కన ఎవరినీ ఎక్కించకూడదని, ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డా మసీదు ఆస్తులపై ఆర్డీవోకు ఫిర్యాదు

జమ్మలమడుగు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని పురాతన గడ్డా మసీదుకు చెందిన ఆస్తులు, భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని కొందరు ఆన్‌లైన్ చేయించుకుని అనుభవిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గడ్డా మసీదు కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం వారు ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ మసీదు గండికోట నవాబుల కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యత పొందిందని, నియోజకవర్గంలోని జమ్మలమడుగు, మైలవరం తదితర ప్రాంతాల్లో మసీదుకు సంబంధించిన పొలాలు, పట్టణంలో స్థలాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జమీర్ బాష, రెహమాన్, మహబూబ్‌బాష, ఇంతియాజ్, షేక్ హమీద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దఫేదార్ ఫయాజ్‌బాష పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే జైలుపాలే : సీఐ

ఖాజీపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు పాల్పడితే జైలుపాలవుతారని సీఐ వంశీధర్ అన్నారు. శనివారం రాత్రి దుంపలగట్టులో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఘర్షణలకు పాల్పడకూడదన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



పంట కాలువలు నిర్మించాలి

ప్రొద్దుటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వేలాది కోట్లు వెచ్చించి నదుల అనుసంధానం చేయడం మాని రాయలసీమలో వున్న ప్రాజెక్టులకు పంటకాలువలు నిర్మించి బీడు భూములను సాగులోకి తీసుకురావాలని రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోకన్వీనర్ ఎస్పీ మహమూద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నేతాజీనగర్‌లోని మాంటిస్సోరి స్కూలులో రాయలసీమ విద్యావంతుల వేదిక ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాయలసీమకు రావాల్సిన నికర జలాలు నేటికీ అందడం లేదన్నారు. గండికోట, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులు నిండినప్పటికీ ప్రాజెక్టు కింద పంటకాలువల నిర్మాణం చేపట్టకపోవడం వలన ఆ నీళ్లు బీడు పొలాలకు అందడం లేదన్నారు. రాయలసీమలో వలసలు నివారించి ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధికల్పన, రైతులకు సాగునీరు అందించాలన్నారు. సమావేశంలో రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కోకన్వీనర్ హమీద్, విరసం మాజీ కార్యదర్శి వరలక్ష్మి, సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ, ఆర్‌వీవీ కార్యవర్గ సభ్యులు బషీర్, జగదీష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు

బి.కోడూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 17 నుండి 30వతేదీ వరకు ఇంటింటి కుష్ఠువ్యాధి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రీ వల్ల వస్తుందని, ఈ క్రిములు తుమ్మడం వల్ల, దగ్గడం వల్ల వ్యాప్తి చెందుతాయని తెలిపారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటాయని ఈ మచ్చలపై చెమట లేకపోవడం, వెంట్రుకలు మొలచకపోవడం జరుగుతుందని, చేతులు, పాదాలు తిమ్మిర్లుగా ఉంటాయని, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, కాళ్ల నుండి పాదరక్షలు జారిపోవడం, కళ్లు పూర్తిగా మూసుకుపోవడం జరుగుతుందన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజరు జాన్‌విలియం, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జువారి బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

ఎర్రగుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జువారి సిమెంట్ కర్మాగారం బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డి మాండ్ చేశారు. శనివారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించి తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జువారి కర్మాగారం నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేస్తోందని ఆరోపించారు. ఫ్యాక్టరీల వచ్చే విషతుల్యమైన రసాయనాల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల గ్రామంలో మిద్దెకూలిన దళిత మహిళకు జువారి సంస్థ బాధ్యత వహించి న్యాయం చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

పోరుమామిళ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు ఆర్టీసీ డీఎం నిరంజన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ఆర్టీసీ బస్టాండులో పాత్రికేయులతో మాట్లాడుతూ అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకబస్సులు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు అధికారుల సహకారంతో ఆర్టీసీ బస్టాండులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. స్త్రీశక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు.

పోటాపోటీగా వేలంపాటలు

కాశినాయన, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అవధూత కాశిరెడ్డి నాయన జ్యోతిక్షేత్రంలో శనివారం నిర్వహించిన టెంకాయల అంగడి, తలనీలాల సేకరణ వేలంపాటలు పోటాపోటీగా సాగాయి. ఈ వేలంపాటల్లో టెంకాలయ అంగడిని ఆకుల నారాయణపల్లెకు చెందిన కర్రా ఈశ్వరెడ్డి రూ.10 లక్షలకు, తలనీలాలను రూ.3.4 లక్షలకు చక్రధర్ దక్కించుకున్నారు. వేలం దక్కించుకున్నవారు డిసెంబరు 4వ తేదీ నుండి ప్రారంభమయ్యే కాశినాయన ఆరాధన నుండి అంగళ్లు ప్రారంభించుకుంటారని నిర్వాహకులు తెలిపారు.

చెక్‌పోస్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్‌కు సంబంధించిన చెక్‌పోస్టును శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు. నందిపల్లె వద్ద ఉన్న మార్కెట్‌యార్డు చెక్‌పోస్ట్ గతంలో బద్వేల్ మార్కెట్‌యార్డ్‌కు అనుసందానంగా ఉండేది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవతో నందిపల్లె చెక్‌పోస్ట్ మైదుకూరు మార్కెట్‌యార్డ్‌కు అనుసంధానం చేశారు. దీంతో మైదుకూరు మార్కెట్‌యార్డ్‌కు మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, రాష్ట్ర కనీస వేతనాల కమిటీ డైరెక్టర్ దాసరిబాబు పాల్గొన్నారు.

అనుమానిత మచ్చలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చర్మంపై స్పర్శ లేని, అనుమానిత మచ్చలు, పొడలపై అప్రమత్తమై వైద్యాధికారులను సంప్రదించాలని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. చర్మం పాలిపోయి లేక రాగిరంగులో పొడలు, మచ్చలు ఉంటే ఆశా కార్యకర్తలకు, ఇంటింటికి వచ్చే ఆరోగ్య సిబ్బందికి చూపించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో శ్రీను, సీహెచ్‌వోలు క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెల్లో పోలీసులు నిద్ర చేయాలి : డీఎస్పీ

ఖాజీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలతో కలిసి నిద్ర చేస్తే వారి సమస్యలను పోలీసులకు తెలుపుతారని డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ఖాజీపేట పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా మెలగాలని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పర్యటించాలని, అలాగే మహిళలపై జరిగే నేరాలపై, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా .. కోటి దీపోత్సవం

బద్వేలు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. ఉదయం స్వామివారికి ప్ర త్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. మ ధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా శివకేశవులకు అభిషేక పూజలు చేశారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వ్యక్తిగత పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం



ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం వలన ప్రజలు మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మలమూత్ర విసర్జనను అరికట్టడం వలన స్వచ్ఛభారత్ సాధ్యమవుతుందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడగడం తదితర నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కోసం కృషి చేయాలి

ముద్దనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు అన్నారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురికి నీరు రోడ్డుపైన వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొక్కలు నాటి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీ నరసింహులు, ఏపీఎం అపర్ణాదేవి, సీసీలు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం విద్యార్థులు, అధికారులు కొండాపురంలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదామని, సచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుదామని ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, డాక్టర్ సాంబశివారెడ్డి ఎంఈవోలు ఓబులేసు, రామయ్య, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ లింగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ శేషఫణి కోరారు. శనివారం 9 సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు.

బి.కోడూరులో...

బి.కోడూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరధిలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయరాదని, మరుగుదొడ్లు వాడాలని సూచించారు. అనంతరం వైద్యశాల ఆవరణంలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

బ్రహ్మంగారిమఠంలో..

బ్రహ్మంగారిమఠం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెలలో మూడో శనివారం ప్రతి ప్రభుత్వ కార్యాలయ ఆవరణాలను పరిశుభ్రం చేసుకోవాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో బ్లీచింగ్ పౌడరు చల్లి, కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరులో..

దువ్వూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత, సమాజ పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణయాదవ్, సర్పంచ్ రామయ్య, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపవరంలో..


గోపవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్ద గోపవరం అంగన్వాడీ కేంద్రం, యూపీ స్కూలులో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పంచాయతీ సెక్రటరీ విజయ్ మాట్లాడుతూ మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ టి.రామానాయుడు, కొండయ్య, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్‌నాయు డు, టీడీపీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతే స్వర్ణాంధ్ర లక్ష్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కోఆర్డినేటర్ డాక్టర్ బోవిళ్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో, అలాగే రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఉన్న గిరినగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్ఈవో సరస్వతి విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తారవిప్రకాశ్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు సులోచన, పర్వీన్, ఈశ్వరయ్య, శ్రీధర్‌మూర్తి, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఎంఈవో వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యుత్ భారం మోపితే ఉద్యమం తప్పదు

బద్వేలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారం తగ్గించకపోతే ఉద్యమం తప్పదని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెల్లూరు రోడ్డు వైఎస్సార్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తాము అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రజలపై రూ.18,243కోట్ల విద్యుత్ భారం మోపిందని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ బిల్లులు తగ్గించకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ ఎంఎల్ నాయకులు